

- పెరిగిన కౌలు ధరలు.. పెట్టుబడులు
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు
- రుణాలివ్వని బ్యాంకులు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలు

కౌలు రైతుకు సాగు కష్టాలు



సొంత భూమి లేని రైతులు వ్యవసాయం చేసేందుకు కౌలుకు తీసుకుని పంటలు వేస్తున్నారు. ఏటేటా కౌలు ధరలతో పాటు పెట్టుబడులు సైతం పెరిగిపోతున్నాయి. అష్టకష్టాలు పడి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు కౌలు రైతును కుదేలు చేస్తున్నాయి. ఫలితంగా అప్పుల ఊబిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్నారు.

బెజ్జూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూముల కౌలు ధరలు ఏటేటా పెరుగుతుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఓ వైపు పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరు గుతున్నాయి. మరో వైపు భూముల కౌలు ధరలను యాజమానులు పెంచుతుండడంతో కౌలు తీసుకుని సాగు చేస్తున్న రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ముందస్తుగానే భూ యజమానులు కౌలు డబ్బులు తీసుకుంటున్నారు. కౌలు రైతులకు వీరికి కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పెట్టుబడి సాయం అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు తగ్గి పోయి అప్పుల ఊబిలో చిక్కుకుని కొట్టుమిట్టాడు తున్నారు.

● పత్తి, వరి సాగే అధికం..

జిల్లాలో రైతులు పత్తి, వరి పంటలనే అధికంగా సాగుచేస్తారు. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేని కారణంగా వర్షాదారంపై ఆదారపడి పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది 3.50లక్షల ఎకరాల్లో పత్తి, 55వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. జిల్లాలో సుమారుగా 20వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా అధికంగా పత్తి సాగు చేస్తారు. జిల్లాలో నాలుగైదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా దిగుబడి రాక నష్టాలను చవిచూస్తున్నారు. ఒక ఏడాది అతివృష్టితో నష్టపోతే, మరో ఏడాది అనావృష్టితో నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నా యి. తొలకరి వానలతో పంటలు విత్తుకున్నా పూత, కాతకు వచ్చే సమయంలో వర్షాలు మొహం చాటేస్తుండడంతో పెట్టుబడి సైతం రాక అప్పులపాలవు తున్నారు. జిల్లాలో సిర్పూర్ నియోజక వర్గంలోని బెజ్జూరు, కౌటాల, చింతల మానేపల్లి, సిర్పూర్(టి) మండలాల పరిధిలో ప్రాణహిత, పెన్‌గంగలు ప్రవహి స్తుండడంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో వరదల కారణంగా పంటలన్నీ నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ప్రాణహిత వరదల కార ణంగా ఏటా దాదాపు 10,000 ఎకరాలకు పైగా పత్తి, 20,000 ఎకరాల్లో వరి పంటలు నీట మునిగి నష్టపో తున్నారు. అయినా వీరికి ప్రభుత్వం సాయం అందిం చకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

● గత్యంతరం లేకనే..

వ్యవసాయం తప్ప మరే రంగంలో పరిజ్ఞానం లేని కౌలు రైతులు గత్యంతరం లేకనే పంటలను సాగు చేస్తున్నారు. ల్లాలో కౌలు ఎకరానికి 10,000 రూపా యల నుంచి 15,000 రూపాయల వరకు పలు కుతోంది. భూమిని బట్టి రైతులు కౌలు చెల్లిస్తున్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులు లేనికారణంగా వర్షాధారంపైనే పంటలు సాగుచేస్తున్నారు. వర్షాధా రంగా పంటలు పండించే భూములకు ఎకరా కు 10,000 రూపాయల నుంచి 15,000 వరకు చెల్లిస్తు న్నారు. పంటలు దిగుబడితో సంబంధం లేకుండా కౌలును చెల్లించాల్సిన పరిస్థితి ఉండటం, పంటలకు మద్దతు ధర లేకపోవడం వంటి ఇబ్బందు లతో కౌలురైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పెట్టిన పెట్టుబడులు సైతం రాక అప్పుల పాలవుతు న్నారు. మరో నెలరోజుల్లో వానాకాలం పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సాగు ఖర్చు కోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకొని సాగు చేస్తున్నా కనీసం పెట్టుబడులు సైతం రాని పరిస్థితులు నెలకొన్నాయి. పంట దిగుబడి రాకున్నా వడ్డీ వ్యాపారుల వద్ద తీసు కున్న డబ్బులను మాత్రం ఎలాగైనా చెల్లించాల్సిందే. ఇక కౌలుకు భూములు తీసుకునే రైతులు ముం దస్తుగానే ఏప్రిల్, మే నెలల్లోనే భూములను కౌలుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే కౌలు ధరలు పెరగడం, ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడి రాని కారణంగా కొందరు రైతులు కౌలుకు భూములు తీసుకోవాలంటేనే భయపడుతున్నారు. రైతులు ఇప్పటి నుంచే భూములను కౌలుకు తీసుకునేందుకు రైతులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. కౌలుకు తీసుకునే భూములకు యజమానులకు ముందుగానే చెల్లించాల్సి వస్తోంది. లేదంటే కౌలుకు ఇచ్చేందుకు భూయజమానులు ముందుకురావడం లేదు.

● వర్తించని ప్రభుత్వ పథకాలు..

కౌలు రైతులకు ఎక్కడా అధికారిక గుర్తింపు లేకపో వడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతీ పథకానికి వీరు అనర్హులుగా మిగిలిపోతు న్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు వారు పొందలేకపోయారు. 2018లో అప్పటి ప్రభు త్వం రైతుబంధు పథకాన్ని ప్రారంభించి ఎకరాకు ఐదు వేల రూపాయల చొప్పున ఏడాదికి పదివేల రూపా యల పెట్టుబడి సాయం అందించింది. ఇక రైతు ఏ కారణంతోనైనా చనిపోయినా రైతులకు బీమా కింద ఐదు లక్షల రూపాయలు అందజేసింది. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా పెట్టుబడి సాయంగా ఆరు వేల రూపాయలు అంద జేస్తోంది. కనీసం బ్యాంకు నుంచి రుణాలు పొందుదామన్న కూడా పొందలేని పరిస్థితిలో కౌలు రైతులు ఉన్నారు. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద దగ్గర ఎక్కువ వడ్డీకీ రుణాలు తెచ్చుకొని వ్యవసాయం చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకు రైతుబంధు పథకం అమలు చేసి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చింది. అయినా ఇప్పటికి ఆ ప్రకటనపై అమలు చేయడంలో ముందుకు సాగడం లేదు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావ డంతో కౌలు రైతులు కూడా తమకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలు వర్తింపచేసే విధంగా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు.

పంట రాకున్నా కౌలు ఇవ్వాల్సిందే..

- చటారి హన్మంతు, రైతు, ఎల్కపల్లి



పంట రాకున్నా భూమి యజమానులకు కౌలు చెల్లించాలి. కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నా. కౌలు భూమిలో పంటలు సాగుచేసి పంట దిగుబడి వచ్చినా రాకున్నా కౌలు చెల్లించాల్సిందే. లేదంటే గ్రామాల్లో కౌలు భూములు ఎక్కడా కూడా దొరకవు. కౌలుతో పాటు సాగు పెట్టుబడి ధరలు కూడా అమాంతం పెరిగిపోవడంతో వ్యవసాయం చేయడం కష్టతరంగా మారింది. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకొని అన్ని రకాల పథకాలు వర్తింపజేయాలి.

పులి మృతి కేసులో కొనసాగుతున్న విచారణ

ఆసిఫాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట మండలం ఎల్లూరు గ్రామ శివారులో మూడు రోజుల క్రితం వెలుగుచూసిన పులి మృతి కేసులో అటవీ శాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి వివిధ గ్రామాల నుంచి అనుమానితులను తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు. గతంలో వన్యప్రాణులను చంపిన వారిపై కూడా ఆరా తీస్తున్నా రు. ఇప్పటి వరకు సుమారు 12 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. కాగా పులి ఖననం చేసిన స్థలాన్ని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వైల్డ్ లైఫ్ కంట్రోల్ బ్యూరో బృంద సభ్యులు సందర్శించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2007-08లో పతో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజర య్యారు. 18 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పుడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యా యులు ఉమబాల, శరత్, లక్ష్మణ్, వెంకటరమణను సన్మానించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కాగజ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన ఘనత సీపీఐది అని పార్టీ జిల్లా కార్యదర్శి బద్రీసత్యనారాయణ అన్నారు. రెబ్బెన మండలంలోని గోలేటిలోని కెఎల్‌మహేంద్రభవన్‌లో ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాల్గొవ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ పీడిత ప్రజల కోసం కార్మిక, కర్షకుల కోసం అలుపెరగని పోరాటాలు చేసిందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఉన్నదన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో చేపట్టే వివిధ అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు సోమారం తిరుపతి, బోగే ఉపేందర్, కిరణ్‌బాబు, జగ్గయ్య, బుదాజీవి, నారాయణ, మారం శ్రీనివాస్, దుర్గం సాయి, అల్లాడి కోటి, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని సీతానగర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన తర్వాత పది రోజుల దాటినా కూడా కాంటా పెట్టి తరలించడం లేదని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగిలో ధాన్యం సేకరణ లక్ష్యం 60వేల మెట్రిక్ టన్నులుగా ఉందని అన్నారు. కానీ ఇప్పటికీ 1,180 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించినట్లు తెలిపారు. మరో పది రోజులు గడిస్తే నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నందున యుద్ధ ప్రతిపాదికన ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో ఆది వారం ఆలయ ఫౌండేషన్ సహకారంతో శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి, సేవా సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ విద్యసాగర్, పెద్దపల్లి కిషన్ రావు, సేవా సమితి ఉపాధ్యక్షులు ముంజం బాబురావు, రాకేష్, దేవాజీ, ప్రధాన కార్యదర్శి తౌటి ప్రభాకర్, కోశాధికారి బాలకృష్ణ, జాడి మంజుల, పొన్న ప్రవంతి, నాగమణి, కస్తూరి అఖిలేష్, సేవా సమితి సభ్యులు వినోద్, రామస్వామి, బొందుల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం

సిర్పూరు(టి), మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర సెక్రటరీ అబ్దుల్ షకీల్ కుమారుడి వివాహ వేడుకల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కరపత్రాలు విడుదల

ఆసిఫాబాద్ రూరల్: మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దస్నాపూర్ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈనెల 22న వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు, తిరుపతి, అశోక్, భాస్కర్, వెంకటయ్య, రమేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు గడువు పొడిగింపు

● మూడో సారి పెంచిన ప్రభుత్వం

కాగజ్‌నగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): అనధికార స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం-2025 కోసం మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంత కాలంగా ఈ పొడిగింపు చేపడుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో అర్జీదారులు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్-2020 స్కీం పేరిట క్రమబద్ధీకరణ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం 25శాతం రాయితీతో ఫిబ్రవరిలో వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రకటించింది. మార్చి 31తో గడువు ముగిశాక, ఏప్రిల్ 30 వరకు, తర్వాత మే 3 వరకు ప్రస్తుతం మళ్లీ ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సమస్యలు తలెత్తకుండా..

సొంతింటి కళ నిజం చేసుకోవాలంటే, అలాగే ఇంటికి రుణం, అనుమతి లేని లేఅవుట్ల క్రమద్ధీకరణ, స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ఇతరత్ర సమస్యలు లేకుండా సదుపాయాలు పొందాలంటే ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా చేసుకో వచ్చని అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ. 1000 ఫీజుతో రెండు మున్సిపాలిటీలు, 335 గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తం 7733 దరఖాస్తులు స్వీకరించారు. 335 గ్రామ పంచాయతీల్లో 4,186 దరఖాస్తులు రాగా, వీటిలో 910 మంది మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 1850 మంది దరఖాస్తులు చేసుకోగా, 280 మంది ఫీజు చెల్లించారు. అలాగే ఆసిఫాబాద్‌లో 1665 మందికి గానూ 237 మంది రుసుం చెల్లించారు. ఎల్‌ఆర్‌ఎస్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. అర్జీదారుడు ఎంపీడీవో, రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల తదితర శాఖకు ఆయా స్థలాలను బట్టి వెళ్లి క్లియరెన్స్ పొందాలి. కాని ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఏ శాఖకు వెళ్లాకుండానే ఒకే చోట ఎన్‌ఓసి పొందే సౌకర్యం ఉంటుంది.

- సుమారు మూడు వేల మంది..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో అర్జీలు పెట్టుకున్న వారిలో సుమారు మూడు వేల మంది ఇంకా రుసుము చెల్లించాల్సి ఉంది. అయితే అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నప్పటికీ అర్జీదారులు కదలిక రావడం లేదు. వెంచర్లు, ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వాటికి అనుమతులు లేకున్నా ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అధికారిక అనుమతులు పొందవచ్చు. అయితే అప్పుడు రూ. 1000 ఫీజు చెలించి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మార్కెట్ విలువ ఆధారంగా రుసుము చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం వల్లనే ముందుకు రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుత రేటు ప్రకారం వేలాది రుపాయలు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో పాటు, కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందికి ఉన్న అదనపు పని భారం కారణంగానే అమలుకు నోచుకోవడం లేదు. అలాగే కొన్ని చోట్ల సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని అర్జీదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రత్యేక దృష్టి పెడితే ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతుంది.



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

31 వరకు గడువు..



ఎల్‌ఆర్‌ఎస్ స్కీం గడువును ప్రభుత్వం ఈనెల 31వరకు పొడిగించింది. కాగజ్‌నగర్ మున్సిపాటిలో వచ్చిన దరఖాస్తులలో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్ ఎస్‌పై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. ఈ డెస్క్‌లో అర్జీదారులు వివరాలు పొందవచ్చు.

- అంజయ్య, మున్సిపల్ కమిషనర్

నేడు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

ఆసిఫాబాద్‌రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల గొడవెల్లిలో పురాతన శ్రీ అంజనేయస్వామి ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్పీఎంలో క్లోరిన్ గ్యాస్ లీకేజీపై మంత్రికి ఫిర్యాదు

కాగజ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం మిల్లులో క్లోరిన్ గ్యాస్ లీకేజీపై విచారణ చేపట్టాలని రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ శాఖ మంత్రికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి గ్యాస్ లీకేజీ సమస్య వచ్చిందని, ఈ నెల 15న సెక్యూరిటీ గార్డు జుమిడి వేణు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడని చెప్పారు. కానీ యాజమాన్యం సాధారణ మృతిగా చెబుతూ అర్ధరాత్రి వేణు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు. గతంలో తాను కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

- మిగిలిన ఎంపిక ప్రక్రియ
- జూన్ 2న యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు



దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని అర్హులందరికి అమలు చేసేందుకు సన్నాహలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు పరిశీలించి సంబంధిత జాబితాను బ్యాంకర్లకు పంపించారు. మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో పరిశీలించి బ్యాంకర్లకు పంపుతున్నారు. వారు పరిశీలించి తిరిగి వీరికే పంపుతారు. మండల స్థాయిలో పరిశీలన పూర్తి కాగానే ఈ నెల 22లోగా జిల్లా స్థాయి కమిటీకి చేరవేస్తారు. అక్కడ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ పరిశీలించి ఇన్‌చార్జి మంత్రి అమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు,, ఇప్పటి వరకు రుణం తీసుకొని వారికి ప్రాధాన్యం కల్పించనున్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

జిల్లాలో కులాల వారీగా..

జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద ఎస్సీ 6,939 మంది, ఎస్టీ 7,370 మంది, బీసీ 12,587 మంది, ఈబీసీ 413 మంది, మైనార్టీ 2677 మంది, క్రిస్టియన్ మైనార్టీ 30 మంది మొత్తం 30,016 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి ఇటీవల మండల పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం లబ్దిదారుల జాబితాను అయా బ్యాంకర్లకు పంపించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు ఈ పథకం కింద రుణాలు అందించనుంది. సిబిల్ స్కోర్ ఉంటేనే రుణం మంజూరవుతుందని లబ్దిదారుల్లో ఆందోళన మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి సిబిల్ స్కోర్ అంటే ఎంటో తెలియదు. బ్యాంకుల నుంచి వ్యవసాయం, వ్యాపారం, ఇతర అవసరాలకు రుణాలు తీసుకున్న వారు సకాలంలో కిస్తీలు చెల్లించకుంటే స్కోర్ తగ్గిపోతుంది. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నవారు రుణాలకు అనర్హులుగా భావిస్తారు. కాగా ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకానికి కూడా సిబిల్ స్కోర్ తప్పనిసరిగా ఉండాలని అపోహలు వస్తుండటంతో లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. రూ. 50 వేల వరకు రుణాలకు సిబిల్ స్కోర్ అవసరంలేదు. రూ. లక్ష ఆపైన రుణాలకు మాత్రమే సిబిల్ స్కోర్ తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం ప్రకటన వెల్లడించింది.

యథేచ్ఛగా కబ్జాలు.. పట్టించుకోని అధికారులు



కబ్జాకు గురైన కాగజ్‌నగర్‌లోని ప్రధాన డ్రైనేజీ

కాగజ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారులు మీనమేషాలెక్కిస్తుండడంతో కబ్జాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణానికి ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మార్కెట్ చివరకు ఉన్న 30 ఫీట్ల కాల్వ కబ్జా గురి చేసేస్తున్నారు. ప్రస్తుతం 15 ఫీట్ల వరకు కబ్జాకు గురైంది. ఈ రోడ్లు మీదుగా నిత్యం అధికారులు, నాయకులు రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం ఈ కాల్వ సమీపంలో ఉన్న ఎల్లాగౌడ్ తోటలో మున్సిపల్ అధికారులు ప్లాట్లు విక్రయించారు. కానీ అప్పట్లో లేని ప్లాట్లు ఇప్పుడు కొత్తగా పుట్టుకొస్తున్నట్టు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సుమారు ఇరవై రోజుల క్రితం కూడా మార్కెట్‌లో నిర్మిస్తున్న భవనం గోడ తాలుకూ ఇటుకలన్నీ చిన్నపాటి గాలికే పడిపోయాయి. ఆ సమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. కబ్జాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలకు పంపాలి

మధూకర్, సీఎంవో (కమ్యూనిటి మోబిలైజేషన్ అధికారి)



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వచ్చే విద్యా సంవత్సరానికి బడిఈడు పిల్లలను పాఠశాలలకు చేర్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీఎంవో: జిల్లా వ్యాప్తంగా బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రతీ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పేరెంట్స్ మీటింగ్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పేందుకు పేరెంట్స్‌కు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

సీఎంవో: ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్ సాయంతో ఆధునిక బోధన పద్ధతులతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత పాఠాల బోధన, సైన్స్, గణితం విభాగాల్లో ప్రత్యేక శిక్షణతో పాటు, గ్రంధాలయ వసతి, క్రీడల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, నిష్ణాతులయిన ఉపాధ్యాయుల చేత బోధనకు ఏర్పాట్లు చేసినట్లు పేరెంట్స్‌కు వివరిస్తున్నాం. వేసవి సెలవుల్లో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నాం.

ఆంధ్రజ్యోతి: యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఎంవో: ప్రతీ విద్యారికి ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసి నిధులు విడుదల చేస్తోంది. ప్రతీ విద్యార్థికి మొదటి జత యూనిఫాంను మే 20లోగా ఆయా ప్రధానోపాధ్యాయులకు అందించేందుకు కొలతలు తీసుకనాల్నం. సకాలంలో అందేలా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రత్యేక అవసరాల పిల్లలకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీఎంవో: ప్రత్యేక విద్యార్థులకు బోధించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. భవిత కేంద్రాల ద్వారా వారిని చేర్పించి ఆయా కేంద్రాల ద్వారా విద్యా బోధన అందించేందుకు సర్వే చేపడున్నాం

- కాగజ్‌నగర్ టౌన్, ఆంధ్రజ్యోతి



నిర్మాణంలో మెడికల్ కాలేజీ

'గుడ్' పేట



కేంద్రీయ విద్యాలయం

- కొలువై ఉన్న విద్యా సంస్థలు
- పలు ఆధ్యాత్మిక కేంద్రాలకు సెలవు
- పర్యాటక కేంద్రంగా ఎల్లంపల్లి

హాజీపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట ఇప్పుడు ఎడ్యూకేషన్ హబ్‌గా, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మారింది. మెడికల్ కాలేజీతో పాటు కేంద్రప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాసంస్థలు కొలువై ఉన్నాయి. ఇటీవల కాలంలో గుడిపేటలో వందల నూతన ఇండ్లు నిర్మాణమవుతున్నాయి. విస్తీర్ణం కూడా ప్రస్తుతం 3 కిలో మీటర్లకు పెరిగింది. రియల్ దందా జోరుగా సాగుతుంది. అందుకే ఇప్పుడు అందరూ గుడ్‌పేట అంటున్నారు.

ఎడ్యుకేషన్ హబ్...

అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో మెడికల్ కాలేజీ మంజూర్ కావడంతో 2023లో అప్పటి హాజీపూర్ మండలంలో ఉన్న గుడిపేట గ్రామ శివారులో 30 ఎకరాల్లో రూ.500 కోట్ల వ్యయంతో ప్రతి విద్యా సంవత్సరం 350 మంది విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసించేలా కాలేజీ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ విద్యా సంవత్సరం ఇక్కడ క్లాస్‌లు ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు 13వ పోలీసు బెటాలియన్ ఆనుకొని 9 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు జరిగింది. ప్రస్తుతం 400మంది విద్యార్థులతో క్లాసులు నడుస్తున్నాయి. మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాల మూడేళ్ల క్రితం ప్రారంభం అయింది. బాలికల పాఠశాల కోసం గతవారం ఇదే శివారులో 7 ఎకరాల స్థలం కేటాయించారు. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల కూడా ఇక్కడే ఉండడంతో గుడిపేట్ ఎడ్యూకేషన్ హబ్‌గా మా రింది. ఒకప్పుడు గ్రామపంచాయతీగా ఉన్న గుడిపేట్ ఇటీవల మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం కావడంతో మరిన్ని విద్యా సంస్థలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా...

గుడిపేట్ 13వ బెటాలియన్ ముందు గోవింద క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్నాడు. ఇక్కడికి భక్తుల తాకిడి ఎక్కువ ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి ప్రతి శని, సోమ వారాలు అధికసంఖ్యలో వస్తుంటారు. పునరావాస కాలనీలో శివపంచాయతన అభయాంజనేయ స్వామి గుడి నిర్మాణంలో ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారిలో నల్ల పోచమ్మ, బుగ్గ పోచ మ్మ, పెద్దమ్మ తల్లి, గంగాదేవి, భీమన్న ఆలయాలు భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాయి. ఇక్కడి కి ఆది, గురువారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పుట్టు వెంట్రుకలు తీస్తూ ఏటలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా ఉండడం, ప్రతి వర్షాకాలం జిల్లా నలుమూలల నుంచి పర్యాటకుల తాకిడి ఎ క్కువైంది. ఇటీవల ప్రాజెక్టు దిగువన 90ఎకరాల్లో రూ.50 కోట్లతో (ఫిష్ పాండ్) ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటించింది.

13వ బెటాలియన్‌తో పాటు మెడికల్ కాలేజీ కాలేజీ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు, ఇటీవల కార్పొ రేషన్‌లో విలీనం కావడం, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉండ డం, 63వ జాతీయ రహదారికి ఆనుకొని జిల్లా కేంద్రానికి కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉండ డంతో గుడిపేట్‌లో నివాసం ఉండడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. దీంతో

పెరిగిన ఇంటి అద్దెలు..

డిమాండ్ పెరిగి ఇంటి అద్దెలు ఒక్కసారిగా పెం చేసారు. కొందరికి ప్రస్తుతం అద్దెకు ఇల్లు దొరుకని పరి స్థితి ఏర్పడుతోంది. స్థిర నివాసాలకు కూడా గుడిపేట్ ప్రాంతం అనుకూలంగా ఉండడంతో రియల్ వ్యాపారం జోరందుకుంది. ప్రస్తు తం గజం స్థలం రూ.20వేలకు చేరింది. పునరావాస కాలనీలో ప్లాట్లు ఇప్పటికే ఐదారు చేతులు మారా యంటే ఇక్కడ భూముల ధరకు రెక్కలు వచ్చాయని అర్థమవుతోంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకా రం రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8712656534లో సంప్రదించాలని తెలిపారు.

గోదావరిలో మునిగి మహిళ..

మంచిర్యాలక్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గోదావరినదిలో గుర్తు తెలియని మహిళ నీట మునిగి మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మహిళకు సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8712656534లో సంప్రదించాలని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరికి గాయాలు

బెజ్జూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బారెగూడలో ఆదివారం ట్రా క్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బారె గూడ గ్రామానికి చెందిన ఉమేష్, డ్రైవర్ అభి ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేసు కొని ఇంటికి వస్తున్నారు. బారెగూడ గ్రామ సమీపంలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ఉమేష్‌కు గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

మందమర్రి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 16 వేలు, 4 సెల్‌ఫోన్, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం సిబ్బంది నిఘా పెట్టారని చెప్పారు. పేకాట ఆడుతున్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో 12 గేదెలు మృతి

నష్టపరిహారం చెల్లించాలని పాడిరైతుల ఆందోళన



మృతి చెందిన గేదెలు

రామకృష్ణాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పరిధిలోని అమరావాది చెరువు సమీపంలో పంటపొలాలకు అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి ఆదివారం 12 గేదెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే కొమురయ్య అనే వ్యక్తి పొలాన్ని కౌలుకు తీసుకొని అందులో కూరగాయల సాగుచేస్తున్నాడు. తరుచు అడవి పందులు పొలాన్ని నాశనం చేస్తున్న క్రమంలో వాటి బారినుంచి పంటను కాపాడుకునేందుకు విద్యుత్‌వైర్లు అమర్చాడు. ఆదివారం అటువైపు వెళ్లిన గేదెలకు విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. పాడిరైతులు ఘటన స్థలానికి చేరుకొని గేదెలకు నష్టపరిహారం చెల్లించాలంటూ కోల్‌బెల్ట్ రహదారిపై ఆందోళన చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, రామృష్ణాపూర్ ఎస్‌ఐ రాజశేఖర్ రైతులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు. దీంతో రావాల్సినటువంటి నష్టపరిహారాన్ని అందించేందుకు కాంగ్రెస్ నాయకులు పల్లెరాజు, యాకూబ్ అలీ, గాండ్ల సమ్మయ్యలు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పంట పొలాలకు అడవి పందులు, ఇతర జంతువులను అరికట్టేందుకు విద్యుత్ వైర్లు అమర్చడం సరికా దని సీఐ సీఐ శశిధర్‌రెడ్డి రైతులకు సూచించారు.

మెట్‌పల్లిలో ఎద్దు..



మృతిచెందిన ఎద్దు

కన్నెపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన నీడం గంగారాం అనే వ్యక్తికి చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫా ర్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందింది. వివరాల్లోకి వెళితే గంగారాం అనే వ్యక్తికి చెందిన ఎద్దు ఉదయం మేతకు వెళ్లిన సమయంలో హనుమాన్ ఆలయం వద్ద మరో ఎద్దుతో పోట్లాట జరిగింది. దీంతో తన ఎద్దు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందిందని, ఎద్దు విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ఎద్దు మృతిచెందిందని విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మెగా జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు

గోదావరిఖని, మే 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మే ళాకు యువత నుంచి స్పందన లభించింది. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి మెగా జాబ్‌మేళాను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే ఉద్యోగాలు కల్పించేలా జాబ్‌మేళాను నిర్వహించి యువకులను ఉత్సాహ పర్చడం అభినందనీయమన్నారు. చాలా మంది ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువకులు ఇబ్బందులకు గురవుతున్నారని, వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోకుండా ఎక్కడ ఉద్యోగం వచ్చినా పని చేసి తల్లిదండ్రులకు అండగా నిలువాలని సూచించారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మొట్ట మొదటి సారిగా నిరుద్యోగులకు ఉపాధి అవశాలు కల్పించడానికి ఈ జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సుమారు 100ప్రైవేట్ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొనగా 8వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో 3వేల మందిని ఎంపిక చేశారు. నియామక పత్రాలను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, సీఎండీ బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు సమక్షంలో అందజేశారు.

కుటుంబాలకు ధీమా.. జీవిత బీమా

వాంకిడి, మే 18 (ఆంధ్రజ్యోతి): బీమా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. పౌరులకు సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో 2015లో అత్యల్ప ప్రీమియంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేవై)ను తీసుకొచ్చింది. బ్యాంకు ఖాతా ఉన్నవారంతా బీమా సౌకర్యం పొందబచ్చనని స్పష్టం చేసింది. అన్ని అర్హతలుఉన్న బీమా చేయించుకోనివారు అధికంగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం దినిపై ప్రత్యేక దృష్టి సారించింది. బీమా పాలసీల్లో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో జన్ సురక్ష పేరిట ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది(ఫైల్)

ఆర్థిక భరోసా..

ఏదైనా ప్రమాదం కారణంగా వ్యక్తి మరణించినా లేదా వైకల్యం పొందినా సంబంధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనను కేంద్రం తీసుకువచ్చింది. వార్షిక ప్రీమియం రూ. 20తో రూ. 2 లక్షల ఆర్థిక సాయంమందించటం ఈ పథకం ఉద్దేశం. బ్యాంకు లేదా పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వ్యక్తులు అర్హులు. ఏటా జూన్ 1 లోగా ప్రీమియం మొత్తం ఆటో డెబిట్ ద్వారా పునరుద్ధరించనున్నారు. ప్రమాదవశత్తు పాలసీదారు మరణించినా లేదా శాశ్వత వైకల్యం పొందినా రూ. 2 లక్షలు , పాక్షిక వైకల్యానికి గురైతే రూ. లక్ష బీమా పరిహారం అభిస్తుంది. ప్రధానమంత్రి జీబన్‌జ్యోతి పథకంలో కేవలం రూ. 436తో రూ. 2 లక్షల బీమా వర్తిస్తుంది. బ్యాంకు ఖాతా ఉండి 18 నుంచి 50 ఏళ్లలోపు వయసున్నవారు అర్హులు. పాలసీదారు సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణించినా రూ. 2లక్షల బీమా పరిహారం లభిస్తుంది.

బాటమ్ యాష్ నిరంతరం రవాణా చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీపీపీ ఈడీ చిరంజీవులు

జైపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని గనులకు బాటమ్ యాష్‌ను నిరంతరం రవాణా చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవులు పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీపీపీలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, ఆయా గనుల మేనేజర్లతో బాటమ్ యాష్ రవాణాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ, ఎస్ఆర్‌పీ 3, ఆర్కే 7 గనులకు కావాల్సిన బాటమ్ యాష్ నిరంతరం రవాణా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుర్మ రాజేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువులో గడ్డిమందు చల్లిన గుర్తు తెలియని వ్యక్తులు



గడ్డిమందు చల్లడంతో ఎండిపోయిన చెట్లు

హాజీపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టికానపల్లి గ్రామ సమీపంలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డిమందు చల్లారని గ్రామస్థులు తెలిపారు. చెరువులో కొంతభాగం గుర్రపు డెక్క ఉన్నందున గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువులో గడ్డి మందును డ్రోన్‌ద్వారా పిచికారి చేశారని ఆరోపించారు. మేతకోసం వెళ్తున్న రైతులకు సంబంధించిన పశువులు చెరువులో నీళ్ల తాగి అస్వస్థతకు గురవుతున్నాయని వాపోయారు. గుర్రపుడెక్కను కూలీలతో కోసివేయాలి కాని గడ్డి మందును చెరువులో పిచికారి చేయడం వల్ల నీరు కలుషితమైందని, అధికారులు స్పందించి గడ్డిమందు పిచికారి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిలిచిన ఇందిరమ్మ ఇళ్ల పనులు



కన్నెపల్లిలో ఇందిరమ్మ ఇంటి కోసం తవ్విన పునాది

లింగాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కల నిమవుతుందని సంతోష పడ్డ కొన్ని రోజులకే అధికారులు అడ్డుకోవడంతో ఇందిరమ్మ ఇళ్ల పనులు నిలిచిపోయాయి. ఇళ్లు నిర్మించే స్థలం అటవీశాఖ పరిధిలోనిదని అధి కారులు చెబుతుండడంతో లబ్ధిదారుల్లో ఆం దోళన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని ఇందిరమ్మ పథకం అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా లింగాపూర్ మండలంలో మొదటి దశలో మండలానికి వక గ్రామ పంచాయతీలో పథకం అమలు చేయాలని నిర్ణయించింది. మోడల్ గ్రామంగా జాముల్‌ధరా గ్రాపంచాయతీని ఎంపిక చేశారు. పలువురు పేదలకు ఇళ్ల మంజూరు పత్రాలు కూడా అధికారులు అందజేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం పలుమార్లు ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. దీంతో అధికారుల సూచన మేరకు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్ల లబ్ధిదారులు తొలగించారు. అధికారులు సూచించిన స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాదులు తవ్వుతుండగా మండలంలోని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ స్థలం అటవీశాఖ పరిధిలో ఉందని, ఇళ్ల నిర్మాణం చేపట్టవద్దని చెప్పారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఉన్న ఇళ్లు కూలగొట్టుకున్నామని, పనులు సాగక పోవడంలో తాము ఎక్కడ ఉండాలని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జాముల్‌ధరా గ్రామపంచాయతీకి మొత్తం 139 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో కేవలం 55 ఇళ్లకే అటవీశాఖ అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. 1952 కంటే ముందు నుంచి ఆదివాసీలందరూ అడవినే నమ్ముకుని ఇక్కడే జీవిస్తున్నారని, ఇప్పులు అధికారులు ఇలా చెబితే పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారు. భూములకు రెవెన్యూ పట్టా ఉన్నా కూడా పనులు అడ్డుకోవడం సరైనది కాదని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. పనుల నిలిపివేతపై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ఇరుకు మలుపులు

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరువు



మలుపు వద్ద నిలిచిపోయిన వాహనాలు

సిర్పూర్(టి), మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాగజ్‌నగర్- కౌటాల ప్రధాన రహదారిపై ఉన్న మూల మలుపులు ఇరుకుగా ఉండడంతో తరుచుగా వాహనాల రద్దీతో ఇబ్బందులు కలుగుతున్నాయి. అత్యవసర సమయంలో 108, 104, అమ్మ ఆదర్శ అంబులెన్స్‌లు వెళ్లడానికి ఈ రహదారి ఆక్రమణలతో ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుందని, అయినప్పటికీ పాలకులు, సంబంధిత శాఖ అధికారులు పట్టింపు లేని విధంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మండలంలో ఆయా గ్రామాల ప్రజలు ఆటోల్లో, ద్విచక్ర వాహనాల పనుల నిమిత్తం సిర్పూర్(టి) రోజు వస్తుంటారు. ఇక సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ఇరువైపులా ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి అద్దెకు ఇస్తున్నారని చెబుతున్నారు. ప్రతి శనివారం నిర్వహించే వారసంత రోజు మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఇరుకైన రోడ్లతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంట్లోకి దూసికెళ్లిన లారీ..

గోవిందాపూర్ ఏరియాలో ఉన్న మూల మలుపు వద్ద గత నెల 28న భారీ లారీ పురాతన ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంట్లో ఎవరు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ నెల 11న మరో మూల మలుపు వద్ద ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. మరో లారీ కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి)కి వచ్చే క్రమంలో ఆర్టీసీ బస్సుకు తగిలింది. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గత మూడు సంవత్సరాల క్రితం బస్టాండ్ వద్ద బోర్‌వెల్ లారీ కిందకు వచ్చి వెంకట్రావుపేటకు చెందిన మాజీ సర్పంచ్ మృత్యువాత పడ్డారు. అలాగే తాగిన మైకంలో మహేష్‌కు చెందిన రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. రెండు నెలల క్రితం పేట్‌మహిళ కాలనీ వద్ద ఉన్న మూల మలుపు వద్ద ఆరో తరగతి విద్యార్థి రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ తిగిలి మృతి చెందాడు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రమత్తతతోనే కరెంటు ప్రమాదాల నివారణ

టీజీఎన్‌పీడీసీఎల్ ఏఈ స్వర్ణలత



ఆంధ్రజ్యోతి: విద్యుత్ ప్రమాదాల బారి నుంచి ఎలా కాపాడుకోవచ్చు?

అధికారి: అప్రమత్తతోనే కరెంటు ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవచ్చు. ముఖ్యంగా వర్షాకాలంలో తడిసిన చేతులతో కరెంటు స్తంభాలను స్టార్టర్లను ముట్టుకోవద్దు. పార్కుల్లో, స్టేడియంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు. వర్షం పడుతున్నప్పుడు ఇంటిలోని ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువులకు సరఫరాను నిలిపివేయాలి. బయట గాలిదుమురాలు వచ్చినప్పుడు కరెంటు స్తంభాల కింద చెట్ల వద్ద నిల్చోవద్దు.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఏర్పడుతుంది. దీని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచే గాలిదుమారాలు ఎక్కువగా వస్తున్నాయి. కరెంటు పోల్స్ విరిగిపోవడం, ఎండల తీవ్రతకు ఎండిపోయిన ఇన్సులేటర్‌పై వర్షం చుక్కపడగానే అవి పగిలిపోతున్నాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగి కరెంటు తీగలపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్ప డుతుంది. వీటి నివారణకు కరెంటు తీగలపై చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాం. ముందస్తు ప్రణాళికతో నాణ్యమైన కరెంటును అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: గృహజ్యోతి పథకంలో ఎంత మంది లబ్ధిపొందుతున్నారు?

అధికారి: మండలంలోని కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 4వేల మందికి పైగా గృహజ్యోతి పథకంలో లబ్ధిపొందుతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా కరెంటు అందజేస్తున్నాం.

- కాసిపేట(ఆంధ్రజ్యోతి)

పోటెత్తిన భక్తజనం

- నాలుగో రోజు లక్షన్నర మంది పుణ్యస్నానాలు
- రద్దీగా మారిన రోడ్లు.. ఎట్టకేలకు వన్‌వే
- వారాంతపు సెలవుతో సందడిగా కాళేశ్వరం

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిలాడాయి. వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ ఆదివారం సందడిగా మారాయి. ఆదివారం మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

● బారులు తీరిన వాహనాలు

ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జాం అవుతోంది. దీంతొ అధికారులు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా పంపిస్తున్నారు. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

● ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహస్వామీతో పాటు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో భక్తులు



కాళేశ్వరం ఆలయం వద్ద భక్తుల రద్దీ

● సాఫీగా సాగిన దర్శనాలు..

మూడు రోజులుగా దర్శనాలకు సాదారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోపురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు

పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

● అందుబాటులోకి ఏరియల్ రైడ్..

సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు.



కాళేశ్వరంనకు వెళ్లేదారిలో బారులు తీరిన వాహనాలు

ఆదివారం నుంచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుండి రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు .4500 రూపాయలు చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను ఈరైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.





గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

మంచిర్యాలలో క్రికెట్ ఎంపిక పోటీలు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలకలెక్టరేట్, మే18(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఏ, ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సీ బాలుర మైదానంలో అండర్ 25 క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపిక పోటీలో 200 మంది ఆటగాళ్లు పాల్గొనగా ఉత్తమ ప్రదర్శన చేసిన 90 మంది క్రీడాకారులను ఆరు టీంలుగా విభజించి రెండు రోజుల క్రికెట్ లీగ్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కోదాటి ప్రదీప్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'మతిభ్రమించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్

మంచిర్యాల క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేస్తున్న అభివృదిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ ఆరోపించారు. తను పదవిలో ఉన్నప్పుడు పనులు చేతకాక పదవి కోల్పోయిన తరువాత అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఒ రాష్ట్రంలోనే అత్యాధునికంగా మహా ప్రస్థానాన్ని నిర్మించారన్నారు. అవినీతిపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పూదరి తిరుపతి, తాజామాజీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను మరిచి ఒకరిపై ఒకరు ఆరోపణలు

- బీజేపీ నాయకుడు రఘునాథ్ ఎర్రబెల్లి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రఘునాథ్ రావు

మంచిర్యాల కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగ్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని బీజేపీ నాయకుడు రఘునాథ్ ఎర్రబెల్లి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రంలో మంచిర్యాల జిల్లాను అవినీతిలో నంబర్ వన్‌గా మార్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు దొందుదొందే అని అన్నారు. ఒకరిపై ఒకరు విమర్శించుకోవడంలో ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో లేదని ఎద్దేవా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మంచిర్యాల గోదావరిపై వంతెన, లక్ష్మీటాకీస్-రాజీవ్‌నగర్ ఫ్లైఓవర్ నిర్మిస్తామని, నిధులు మంజూరు అయ్యాయని క్షీరాభిషేకాలు, ర్యాలీలు తీసి గొప్పలు చెప్పుకున్నారే తప్ప పనులు ప్రారంభించలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తన లాభం కోసం బ్రిడ్జిని రద్దు చేయించి మరొక ప్రాంతానికి తరలించారని అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన చోటే గోదావరిపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, మోటపలుకుల తిరుపతి, తులా ఆంజనేయులు, బియ్యాల సతీష్‌రావు, జోగుల శ్రీదేవి, మదువరపు వెంకట రమణరావు, అమిరిశెట్టి రాజుకుమార్, గడ్డం స్వామి రెడ్డి, వీరమల్ల హరిగోపాల్, మోతే సుజాత, ముదాం మల్లేశ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, గాజుల ప్రభాకర్, పచ్చ వెంకటేశ్వర్లు, బింగి ప్రవీణ్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణ ప్రతీఒక్కరి బాధ్యత

మంచిర్యాలకలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ సుధాకర్‌నాయక్, శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ఇంటర్‌నేషనల్ క్యాండిల్‌లైట్ డేను పురస్కరించుకొని కొవ్వొత్తులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలని, రోగులను గుర్తించడంలో వారికి చికిత్స అందించడంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ద్వారా సాయంమందేలా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వైద్యులు, ఆర్‌ఎంవో భీష్మ, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ రీఫండ్ ఎప్పుడు?

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఫీజులు వసూలు చేసినప్పటికీ వివిధ కారణాలతో స్లాట్లు రద్దు చేసుకున్న వారికి తిరిగి చెల్లించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారి ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటే తప్పనిసరిగా ఆ కార్య కలాపాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే పూర్తిగా ఆ స్లాట్‌ను రద్దు చేసుకుంటే మా త్రం చెల్లించిన ఫీజు, స్టాంప్ డ్యూటీ విధిగా చెల్లిం చాలి. ఈ విషయంలో చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉంది.

తప్పులు దొర్లితే అంతే సంగతులు...?

ధరణి పోర్టల్‌లో ఫీజు చెల్లించిన తరువాత స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అందులో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఒక్క అక్షరం తప్పు దొర్లినా సరిదిద్దే అవకాశం లేకుండాపోయింది. దీంతో చెల్లించిన ఫీజు ఏ ఖాతాల్లోకి వెళ్లింది? ఎవరిని సంప్రదించాలి?, రీఫండ్ డబ్బులు ఇస్తారా? అవి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి వస్తాయా? అసలు బ్యాంక్ ఖాతాలు ఎవరు అడుగుతారు? అన్న సందేహాలు ఉన్నాయి. ధరణి పోర్టల్ రాకముందు వ్యవస్థలో ఏదైనా పొరపాటుగా అక్షర దోషాలు ఉంటే వాటిని సవరించుకునే అవకాశాలు ఉండేది. ధరణి పోర్టల్ వచ్చిన తరువాత సవరణకు అవకాశం లేకుండా పోయింది. ఒక్క చిన్న తప్పు జరిగినా స్లాట్‌కోసం చెల్లించిన ఫీజు మొత్తం తిరిగి వస్తుందా లేదా అన్న స్పష్టత కూడా లేదు.

● మార్పులు జరిగేనా?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ భారతి పోర్టల్ తీసుకువచ్చినందున కనీసం అందులోనై సవరణలకు అవకాశం ఉంటుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ధరణి పోర్టల్ కింద వసూలు చేసి, స్లాట్ రద్దయిన పక్షంలో సొమ్ములు తిరిగి చెల్లించాలని గత ఏడాది డిసెంబరు 13న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. అయితే భూ భారతిలోనైన స్లాట్‌ల సొమ్ము తిరిగి చెల్లించే అవకాశం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే తప్పు ఒప్పులను సవరించుకునేందుకు అవకాశం కల్పించాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

పంచముఖ ఆలయంలో వైభవంగా హోమాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మందమర్రి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం హోమాలు, పూజలు నిర్వహించారు. మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు రామానందజియర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాదిగా భక్తులు రావడం సంతోషకరమన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్‌షిప్ టెస్టు

మంచిర్యాలకలెక్టరేట్, మే18(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ దిల్‌సుక్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల డిప్లొమా, డిగ్రీ, ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సు, పీజీ డిప్లొమో కోర్సుల్లో ఫ్యాషన్ రంగం ఎంచుకోవాలనుకున్న విద్యార్థులకు ఎన్‌ఐఎఫ్‌డీ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ రంగంలో రోజురోజుకు పలు మార్పులు రావడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బొటిక్స్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులను 24 తేదీ వరకు చేసుకోవచ్చని, 25న పరీక్ష ఉంటుందని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు సెల్‌నంబర్ 9030610033, 9030610055 సంప్రదించాలని కోరారు.

విద్యార్థిని ప్రతిభ

దండేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్యాల మనీష అనే విద్యార్థిని మేధా చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉచిత విద్య కోసం ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్న నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదోతరగతి విద్యార్థులకు మేధా చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన పరీక్షలో మనీష అత్యంత ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మల్లంపేట ఎస్‌ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఈ ట్రస్ట్ ద్వారా ఆరు సంవత్సరాల వరకు విద్యార్థినికి హాస్టల్, ట్యూషన్ ఫీజ్ అందిస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థిని మనీషను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోపణలు మానుకోవాలి

జన్నారం, మే 18 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులపై ఆరోపణలు మానుకోవాలని కామనపల్లి, కవ్వాల్ గ్రామానికి చెందిన రైతులు వంపల్లి రాజేశ్వర్‌రావు, తోట లచ్చన్న సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కవ్వాల్‌టైగర్ జోన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లోగల నర్సింహస్వామి గుట్ట అటవీ ప్రాంతంలో మట్టిని తోడుతున్నారని మాజీ ఎంపీటీసీ రియాజోద్దీన్ ఆరోపణలు చేస్తూ అటవీశాఖ అధికారులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు రవిగౌడ్, బీరుపురి రవి, ఆకుల శ్రావ్య, కవిత, ఆకుల రాజేశ్, సాయి, బుచ్చయ్య, దుబ్బయ్య పాల్గొన్నారు.

దళిత ఎంపీని అవమానించడం సరికాదు



జైపూర్‌లో నిరసన తెలుపుతున్న మాదిగ హక్కుల దండోరా నాయకులు

మందమర్రి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జయశం కర్ భూపాలపల్లి జిల్లాలో ప్రారంభించిన సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఆహ్వానించకపోవడం దళిత ఎంపీని అవమానించడమేనని ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేవలం దళితు డైనందునే పెద్దపల్లి ఎంపీని పుష్కరాలకు ఆహ్వానించలేదని మండిపడ్డారు. దళిత సంఘాల నాయకులు మొయ్య రాంబాబు, కనకం రవీందర్, శ్రీనివాస్, పాత వీరస్వామి, కొడిపెల్లి రాజయ్య, పాల్గొన్నారు.

జైపూర్: దళిత ఎంపీని అవమానించిన వారిపై దండోరా మోగిస్తామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ పేర్కొన్నారు. సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి కాళేశ్వరం పర్యటనకు వచ్చిన సందర్భంగా దళిత ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటోలను ఫ్లెక్సీల్లో పెట్టకపోవడం, ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కదారి మల్లేష్, జనంపెల్లి బానేష్, జనంపెల్లి సంపత్ పాల్గొన్నారు.

● మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ముదిగుంట మాజీ సర్పంచు బత్తుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి అంబేద్కర్ కాళ్లను పాలతో కడిగారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లనగేష్, పగిడె శంకరయ్య, రాజం, పున్న ంయాదవ్, మాజీ కో ఆప్షన్‌సభ్యుడు జైనుద్దీన్, సురేష్, బానయ్య, ప్రియాన్‌యాదవ్ పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలను చేయించుకోవాలి

నెన్నెల, మే 18 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు భూసార పరీక్షలు తప్పకుండా చేయించుకోవా లని ఏఈవో రామ్‌చందర్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ జగిత్యాల జిల్లా పొలాస కళాశాల ఇన్ సర్వీస్ విద్యార్థులు చేసిన భూసార పరీక్షల ఫలితాల కార్డుల ను ఆదివారం గంగారం గ్రామ రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడారు. ఇన్ సర్వీస్ విద్యార్థులు దుర్గం శ్రీధర్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు భూసార కార్డులు అందజేస్తున్న అధికారులు

యువతి వివాహానికి ఎమ్మెల్యే చేయూత



నగదు అందజేస్తున్న నాయకులు

లక్షెట్టిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం దౌడేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద యువతికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 10వేల రూపాయల నగదు శనివారం అందించి చేయూతనందించారు. దౌడేపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల సత్తయ్య, సత్తవ్వ దంపతుల కుమార్తె శివప్రియ వివాహం జరిగింది. వదువు నిరుపేద కుటుంబం అని గ్రామ నాయకుల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. శనివారం కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించి తన వంతుగా నాయకుల ద్వారా 10,000 ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ఆర్పీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, బొప్పు సుమన్, తీర్థాల వెంకటేష్, సత్యనారాయణరెడ్డి, సందెల సురేష్, దుమ్మని సత్తయ్య, పిట్టల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవి విద్యాలయ ప్రత్యేక అధికారిణి మంజుల ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. ఆరోతరగతిలో 40, ఏడో తరగతిలో 20మంది, ఈ ఏడాది ఇంటర్మీడియేట్ కోసం అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఇంటర్మీడియేట్‌లో ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్స్ కోర్సుల్లో 40సీట్ల చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959204977 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా కామెర దుర్గారాజు

మందమర్రిటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శిగా బురదగూడెంకు చెందిన కామెర దుర్గారాజు నియమితులయ్యారు. 11వ మహాసభల సందర్భంగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దుర్గారాజు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ప్రజల సమస్యల సాధనకు పోరాటాలు చేపడతామన్నారు.

బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోస్టర్లు విడుదల

మంచిర్యాలక్రైం, మే18(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో జరుగబోయే టైసన్‌కప్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోస్టర్లను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో మంచిర్యాల పట్టణంలోని ఎఫ్‌సీపీ ఫంక్షన్‌హాల్‌లో జరిగే బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, తాజా మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రీఫండ్ ఎప్పుడు..?

- సంవత్సరాలు గడుస్తున్నా చేతికి అందని స్లాట్ల రద్దు డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో పేరుకుపోయిన కోట్లాది రూపాయలు
- భూభారతి అమలు నేపథ్యంలో అయోమయం
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

మంచిర్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి వినియోగదారులు చెల్లించిన రుసుం ఎప్పుడు తిరిగి వస్తుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. మూడు నాలుగు సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లాలో వందలాది మందికి చెందిన కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. చివరిసారిగా 2021-22లో కొంత రీఫండ్ చేసినప్పటికీ స్లాట్లు రద్దు చేసుకున్నవారందరికీ పెద్దమొత్తంలో డబ్బులు రావాల్సి ఉంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు చెల్లించిన సొమ్ములను తిరిగి ఇచ్చేందుకు చొరవ చూపకపోవడంతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతిని తీసుకొచ్చింది. గతంలో ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని చెల్లించిన డబ్బుల విషయం కొలిక్కిరాకపోవడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. అసలు ధరణి డబ్బులు వస్తాయో, రావోనన్న సందేహాలు నెలకొన్నాయి. భూభారతి అమలులోకి వచ్చిన తరువాత ధరణి పోర్టల్ దాదాపుగా నిలిచిపోయింది. ఆ సమయంలో చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో ఇంత వరకు ఎలాంటి స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో స్లాట్లు బుక్ చేసుకున్నారు. ఇందుకు అవసరమైన రుసుమును కూడ చెల్లించారు ఒక్కో దరఖాస్తుదారుడు రూ. 25వేల నుంచి రూ. 50 వేల వరకు చెల్లించినట్లు తెలుస్తోంది. మొత్తంగా పెండింగ్‌లో ఉన్న డబ్బులు కోట్లలోనే ఉంటాయని అంచనా. ఇదిలా ఉండగా భూ సమస్యలు పరిష్కారం కాక చాలామంది స్లాట్లను ఉపసంహరించుకున్నారు. వీరందరికి ప్రభుత్వం డబ్బులను తిరిగి చెల్లించాల్సి ఉంది. జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి అమల్లోకి రానుంది. భూ భారతిపై ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో అధికారులు అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేశారు.

కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు...

వ్యవసాయ భూములు, ఇతర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ కోసం ధరణి పోర్టల్‌లో చెల్లించిన రుసుం వెనక్కి ఇస్తారేమోనన్న ఆశతో వందలాది మంది వినియోగదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలు, నాలా కన్వర్షన్ అనుమతులు, విరాసత్ కోసం పేర్ల మార్పిడి, ఇంటి రిజిస్ట్రేషన్లు తదితర వాటి కోసం ధరణిలో స్లాట్‌ను బుక్ చేసుకునేందుకు వారంతా మీ సేవా కేంద్రాల్లో నిర్దేశిత ఫీజులను చెల్లించారు. అయినప్పటికీ వివిధ కారణాలతో స్లాట్లను అధికారులు రద్దు చేయడమో, లేక బుక్ చేసుకున్న వారు ఆయా కారణాల వల్ల స్వయంగా రద్దు చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. అలా రద్దు చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించిన సొమ్మును తిరిగి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ధరణి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు స్లాట్ సొమ్ములు తిరిగి రాలేదు. వాటి కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని రద్దయిన వారికి సొమ్ము చెల్లింపుల విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. సంబంధిత అధికారులకు కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

● సొమ్ము జమ అయ్యేది ఎప్పుడూ?

స్లాట్ బుక్ చేసుకొని ఆ తరువాత రద్దు చేసుకున్న వారికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లోకి చలాన డబ్బులు జమ చేస్తుందని అధికారులు చెబుతున్నారు. స్లాట్ రుసుం, ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుండగా తిరిగి అక్కడి నుంచి రద్దు చేసుకున్న వినియోగదారులకు అందాల్సి ఉంటుందంటున్నారు. స్లాట్ రద్దయిన వెంటనే సొమ్ము తిరిగి చెల్లించడం విషయంలో రెవెన్యూశాఖకు సంబంధం లేదని దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. ధరణి పోర్టల్ పేరుతో అప్పటి..

మిగతా 5లో

ఆదమరిస్తే అంతే..



బాదంపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గుంత

జన్నారం, మే 18 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండల కేంద్రంలోని బాదంపల్లి గ్రామానికి వెళ్లే ప్రదాన రహదారిపై గల డిస్ట్రిబ్యూటరీ కాలువపై ఉన్న వెంతన సమీపంలో భారీ గుంత ఏర్పడి సంవత్సరకాలం గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల ద్వారా బాదంపల్లి మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా గోదావరి పుష్కరఘాట్ ఉండడంతో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలి వస్తుంటారు. ఈ దారి గుండా వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళలో గుంతలు ఏర్పడకపోవడంతో వాహనాలు ఎక్కడ ప్రమాదానికి గురవుతాయోనని ప్రయాణికులు భయపడుతున్నారు. దీనికి తోడు సమీపంలోనే వంతెన ఇరుక ఉండి సైడ్‌వాల్స్ లేక ప్రమాదకరంగా మారింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిత్యం గ్రామ ప్రజలు సమీపంలోని పొలాలతో పాటు వివిధ పనుల నిమిత్తం జన్నారం మండల కేంద్రానికి వెళ్లడానికి ఇదే ప్రధాన దారి ఇదే కావడంతో అటు రైతులు, ఇటు గ్రామప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఇరుకు వంతెన

నేడు ఏసీబీ కార్యాలయం ప్రారంభోత్సవం

- ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి రాక



నస్పూర్‌లో ఏసీబీ డీఎస్పీ కార్యాలయం

నస్పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ కార్యాలయం నస్పూర్ పట్టణం సీసీసీ టౌన్‌షిప్‌లోని పాత పోలీస్‌స్టేషన్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి హాజరు కానున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యాలయం ప్రారంభోత్సవానికి ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి వస్తున్నారని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ రేంజ్ పరిధిలో మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు మంచిర్యాల జిల్లా డీఎస్పీ కార్యాలయం ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు కలిపి ఆదిలాబాద్‌లో కార్యాలయం కొనసాగుతోంది. సీసీసీలోని భరోసా కేంద్రం పక్కన ఏసీబీ డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లు ఆదిలాబాద్ వెళ్లడానికి దూరభారం కావడంతో ఫిర్యాదు చేయడానికి చాలా మంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. నస్పూర్‌లో ఏర్పాటు చేసే కార్యాలయంతో రెండు జిల్లాల ఫిర్యాదుదారులకు మరింత చేరువ అవుతుంది. కార్యాలయంలో డీఎస్పీతో పాటు ఇద్దరు సీఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, ఇతర సిబ్బంది 14 మంది వరకు ఉంటారు.

పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికి పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, మే18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికి ప్రాధాన్య క్రమంలో పదవులు అప్పగిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాంగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడారు. తనను నమ్మి ఓటు వేసిన ప్రజలకు, కాంగ్రెస్‌పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిని పార్టీ ఎప్పుడు నిర్లక్ష్యం చేయదని తగిన ప్రాధాన్యత ప్రకారం పదవులు కల్పిస్తామని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయ కులు మండల పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, మండల కమిటీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి పథకం

పేద ప్రజలకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణం పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో చేయని అభివృద్ధిని మంచిర్యాల నియోజకవర్గంలో చేసి చూపించామన్నారు. ఇప్పటి వరకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం కింద 1,935 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయగా సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను 1,060 మందికి అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే పేదలకు అండగా ఉండే ప్రభుత్వమన్నారు. 114 మంది లబ్ధిదారులకు ఒక కోటి 14లక్షల 13వేల 224రూ పాయల చెక్కులను అందజేయగా, సీఎంఆర్ఎఫ్ 138 మంది లబ్ధిదారులకు 64,35,200 రూపాయల చెక్కులను అందజేశారు.

దండేపల్లి: అనారోగ్య సమస్యలతో ప్రైవేటు, కార్పొరే ట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వరంగా నిలుస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాస గృహంలో దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన బుద్దె శంకరయ్యకు మంజూరైన 12,000 రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆకుల దుర్గప్రసాద్ ఉన్నారు.

అటవీ సంరక్షణ చట్టాలపై అవగాహన



అటవీ సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

జన్నారం, మే 18 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ కార్యాలయంలో అటవీ సిబ్బందికి ఆదివారం అటవీ సంరక్షణ చట్టాలపై వైల్డ్‌లైఫ్ న్యాయవాదులు తిరుపతి, శివ శంకర్, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, కేసులపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులు పొలా లు, చేన్ల వైపు వెళ్లి విద్యుదాఘాతానికి గురైతే కంచెకు విద్యుత్ తీగలు అమర్చినవారిపై కేసు లు, వన్యప్రాణులు హతమార్చినవారిపై కేసులు, స్మగ్లర్లదాడి వంటి కేసులపై అవగాహన కల్పిం చారు. ప్రతి అధికారి వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ క్రాస్ సిబ్బంది వెంకట్‌తో పాటు ఎఫ్ఆర్ వో దారం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు



బోయపల్లి, రేపల్లెవాడ మధ్య రోడ్డుపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తిస్తున్న పోలీసులు, హైవే అధికారులు

తాండూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి బోయపల్లి నుంచి రేపల్లెవాడ వరకు ఉన్న బ్లాక్ స్పాట్ ప్రదేశాలను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను, రోడ్డు మధ్యలో లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని హైవే అధికారులను కోరడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మద్యం సేవించి ఫోన్ మాట్లాడుతూ వాహనాలు వేగంగా నడపవద్దన్నారు. గ్రామాల ప్రజలు రోడ్డుపై సూచించిన నిర్దేశిత ప్రదేశాలను మాత్రమే అనుసరించి రోడ్డును దాటాలన్నారు. పశువుల యాజమానులు పశువులను రోడ్లపై విడిచిపెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, హైవే అధికారులు పాల్గొన్నారు.

పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం

కాసిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమగూడెం వద్ద ప్రధాని నరేంద్రమోదీ, బిహార్ సీఎం నితీష్ కుమార్ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ మాట్లాడుతూ మోదీ సర్కార్ బిహార్ రాష్ట్రం దర్భాంగలోని అంబేద్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను రాహుల్‌గాంధీ కలవడానికి వెళితే పోలీసు బలగాలతో అడ్డుకున్నారన్నారు. రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసులు నమోదు చేశారన్నారు. బీజేపీ విధానాలను మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సోమగూడెంలో మోడీ, నితీష్ కుమార్‌ల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాలకలెక్టరేట్, మే18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం తలసేమియా పిల్లలకు ఉచిత వైద్య శిబిరం రక్తనిధి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 84 మంది వ్యాధి గ్రస్తులకు తలసేమియా సికిల్‌సెల్ పిల్లలకు డాక్టర్ రంజిత్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తానికి సంబంధించిన వివిధ రకాల టెస్టులను నిర్వహించి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఈశిబిరంలో వారి తల్లిదండ్రులు సుమారు 170 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. మదుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి కె. సత్యపాల్ రెడ్డి, డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ అపరంజి, జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్‌కుమార్, శంకర్‌వర్మ, ఎడ్లకిషన్, కాసర్ల శ్రీనివాస్, సత్యనాయణరావు, రక్తనిధి సిబ్బంది సూపర్‌వైజర్ కె. మాధవి, ఎఎన్‌ఎం రజిత, మౌనిక, శైలజ, శిరీష, టెక్నికల్ స్టాఫ్ ప్రణయ్, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్

మందమర్రి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ పట్టణ 11వమహాసభకు ఆయన హాజరయ్యారు. ముందుగా ఆర్ వెంకన్న పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలన్నారు. చర్మకారుల కోసం ఏర్పాటు చేసిన తోళ్ల పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. ఇప్పటికే ఎన్‌కౌంటర్‌లో చాలా మంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారన్నారు. ఒక వైపు శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధమని చెప్పినా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. తమ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్టీ ప్రజల కోసం చేపడుతున్న పోరాటాలు వివరిస్తూ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల కోసం పనిచేసిన పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. వంద సంవత్సరాల చరిత్రలో ప్రజా పోరాటాల్లో వెనుకబడుగు వేయలేదని పేర్కొన్నారు. నిజాంపాలన నుంచి ఇప్పటి వరకు చాలామంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. దొరలు, భూస్వాములకు, దొరల దురహంకారానికి వ్యతిరేకంగా పోరాడి కార్మికుల హక్కుల కోసం పోరాడిన వీటీ అబ్రహం స్ఫూర్తితో ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, బండారి రాజేషం, ఆంథోని దినేష్, ఎలిగేటి వజ్ర, పద్మ, బచ్చల అభిరాం, పట్టణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్: వచ్చే నెల 21, 22 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల అయిన సందర్భంగా శ్రీరాంపూర్‌లోని కటిక దుకాణాల వద్ద నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులను అర్హులందరికీ ఇవ్వాలని కోరారు. నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంతంలో ఇప్పటివరకు పట్టాలు ఇవ్వనివారికి ప్రభుత్వం పట్టాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు, శ్రీరాంపూర్ శాఖ కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లింగమూర్తి, నాయకులు లచ్చన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.